www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు


తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 234 బుధవారం 22- 01 - 2025 ఎడిటర్ : పి. జయరాం పేజీలు : 8 వెల : 4

కొలిక్కిరాని చెముడులంక శ్రీనివాస్ నగర్ రోడ్డు సమస్య



4



# బిడ్డా.. ఖబడ్దార్

- ప్లాట్లు కొన్నవారిని ఇబ్బంది పెడుతున్నారంటూ కొట్టిన వైనం
- ఆపై దాడికి దిగిన ఎంపీ అనుచరులు.. ఇద్దరికి గాయాలు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు.



## రియల్టర్ అనుచరుడిపై ఎంపీ ఈటల దాడి

తొలిఅడుగు, హైదరాబాద్ : సుదీర్ఘ రాజకీయ జీవితంలో సౌమ్యుడిగా పేరున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. ఆవేశానికి లోనయ్యారు. పేద ప్రజలు కొనుక్కున్న స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు వారికి అనుమతులు రాకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ ఓ రియల్ వ్యాపారి అనుచరుడిపై చేయి చేసుకున్నారు. ఆ వెంటనే ఈటల అనుచరులు కూడా అతనిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపల్ పరిధిలోని కొర్రెముల ఏకశిలానగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్లాట్ల బాధితుల తరపున ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం స్థల పరిశీలనకు వెళ్లారు. ఆ సమయంలో వెంచర్‌లోనే ఉన్న సదరు రియల్ వ్యాపారి అనుచరులను గమనించిన బాధితులు.. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నది వారేనంటూ 2

## గరియాబంద్‌లో భారీ ఎన్‌కౌంటర్



తొలిఅడుగు, ఛత్తీస్‌గఢ్, గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ ఇప్పటి వరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఇంకా ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని కుల్హాడి ఘాట్‌లోని అటవీ ప్రాంతాన్ని 2

## మహా కుంభమేళాలో పాల్గొననున్న ప్రధాని



2

తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ మహాకుంభమేళాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నట్లు తెలిసింది. వచ్చే నెల అంటే ఫిబ్రవరి 5వ తేదీన ప్రధాని


# జనసేన కీలక నిర్ణయం

కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ

JANA SENA

తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి నాయకుల మధ్య పెరుగుతున్న అంతరాలను తగ్గించేందుకు ఇరు పార్టీలు సమాయత్తమయ్యాయి. ముఖ్యంగా డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ స్పందించవద్దని తాజాగా జనసేన కేంద్ర కార్యాలయం నాయకులకు, కార్యకర్తలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. మీడియా ముందుగాని, సోషల్ మీడియాలో గాని స్పందించవద్దని సూచించింది. ఇప్పటికే కూటమిలో ప్రధాన భాగస్వామ్యంగా ఉన్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక మంత్రిత్వశాఖలను కేటాయించింది. పవన్‌తో పాటు మరో ముగ్గురికి మంత్రిగా అవకా శాలు దక్కాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తుంది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి తనయుడు , మంత్రి నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం హోదా 2

## దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం



తొలిఅడుగు, దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఇఎఫ్) 2025 వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ 2

## ఆ ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వానిది కపటనాటకం



తొలిఅడుగు, చెన్నై: పచ్చటి పొలాలతో కళకళ లాడుతున్న పరందూరు సహా 13 గ్రామాల రైతులకు అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ఎవరినో సంతృప్తి పరిచేందుకు విమా నాశ్రయ ప్రాజెక్టు అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని 'తమిళగ వెట్రి 2

## కేంద్రం గుప్పిట్లోకి విశ్వవిద్యాలయాలు



తొలిఅడుగు, హైదరాబాద్ : విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల కోసం 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)' రూపొందించిన ముసాయిదాను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్రం గుప్పిట్లోకి వెళతాయని ఆందోళన చెందుతోంది. ఇది తీవ్ర అభ్యంతరకరంగా ఉందంటూ కేంద్రానికి లేఖ రాయనుంది. రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ప్రభుత్వం ఈ 2

# కౌంటర్ వేసే తీరిక లేదా?

- రెండు వారాల్లో దాఖలు చేయాలి - కేంద్రం తీరుపై హైకోర్టు ఆగ్రహం



తొలిఅడుగు, హైదరాబాద్ : లైంగికదాడి బాధితులైన మహిళలకు రక్షణ కల్పించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు ఇంకెంత సమయం కావాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నాలుగు నెలలుగా కౌంటర్ దాఖలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. లైంగికదాడి కేసుల్లో దోషిగా తేలిన వ్యక్తికి శిక్ష పడిన మూడు నెలల్లోగా బాధితురాలికి అతని ఆస్తి నుంచి 50 శాతం పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకునేలా కేంద్రానికి, నెల రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జీ రాధారాణి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. తెలంగాణలో మహిళలపై నేరాలు పెరగడానికి కారణాలు, వైఫల్యాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ)ను ఆదేశించాలని ఆయన కోరారు. వాదనల తర్వాత కేంద్రానికి నోటీసులు జారీ చేసి విచారణను వచ్చే నెల 4కు హైకోర్టు వాయిదా వేసింది.

## ఆ రంగంలో కొత్తగా 5 లక్షల ఉద్యోగాలు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : విద్యుదుత్పత్తిలో బొగ్గు వినియోగం దాదాపుగా తగ్గినా, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడం వల్ల బొగ్గు రంగం రాబోయే కొన్నేళ్లలో 2

# గరియాబంద్‌లో భారీ ఎన్‌కౌంటర్

వెయ్యి మందికిపైగా భద్రతా బలగాలు అన్ని వైపులా చుట్టుముట్టాయి. అటవీ ప్రాంతంలో 60 మందికిపైగా మావోయిస్టులు అక్కడ దాక్కున్నట్లు సమాచారం మేరకు బలగాలు ఆపరేషన్ నిర్వహించాయి. ఎన్‌కౌంటర్‌లో ఓ జవాన్‌ను గాయపడ్డాడు. గాయపడ్డ జవాన్‌ను విమానంలో రాయ్‌పూర్‌కు తరలి స్తున్నారు. ఇప్పటి వరకు 16 మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయ్‌పూర్ జోన్ ఐజీ అమ్రేష్ మిశ్రా తెలిపారు. సంఘటనా స్థలంలో ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ తదితర ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ జరుగుతుందన్నారు. మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుల్హాడి ఘాట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి నుంచి భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోందని.. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోయి నట్లుగా సమాచారం అందిందని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. మార్చి 2026 నాటికి దేశం, రాష్ట్రంలో నక్సలైట్లను అంతం చేయాలనే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పం మేరకు భద్రతా బలగాలు ఈ విషయంలో నిరంతరం విజయం సాధిస్తూ లక్ష్యం వైపు వేగంగా కదులుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బలగాలకు ప్రశంసించిన ఆయన.. ధైర్య సాహసాలకు వందనం చేస్తున్నానన్నారు.

# ఆ రంగంలో కొత్తగా 5 లక్షల ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి** ఐదు లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం పెంపుదలపై రాష్ట్రాలు దృష్టి సారించాలని కోరారు. ఒడిశాలోని కోణార్క్‌లో జరిగిన ఓ జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి ప్రసంగించారు. దేశానికి ఏడాదికి 2 బిలియన్ టన్నుల బొగ్గు అవసరమని, 2040 నాటికి డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అన్నారు. థర్మల్ పవర్ డిమాండ్‌లో 72 శాతం ఫలించిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2014తో పోలిస్తే బొగ్గు ఉత్పత్తి 76 శాతం పెరిగి 2024 నాటికి 997 మిలియన్ టన్నులకు చేరుకుందన్నారు. '2030 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ బొగ్గు ఉత్పత్తి విలువ దాదాపు రూ.1.86 లక్షల కోట్లు. కోల్ రంగంలో 2 శాతం సహకరిస్తుంది' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.8,500 కోట్లతో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును ప్రారంభించిందని కిషన్ రెడ్డి తెలిపారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ గనుల అన్వేషణను ప్రోత్సహించడానికి ఇప్పటివరకు 329 ప్రాజెక్టులకు నిధులు సమకూర్చిందని పేర్కొన్న కిషన్ రెడ్డి, ఖనిజాల అన్వేషణను ప్రోత్సహించడానికి , ఇలాంటి ట్రస్టులను ఏర్పాటు చేయడానికి నిధులను ఉపయోగించాలని రాష్ట్రాలను కోరారు. అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు కేంద్రం మైనింగ్ నిఘా వ్యవస్థను ప్రారంభించిందని, దీనిని అరికట్టేందుకు రాష్ట్రాల సహకారం తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు. గనుల



రవాణా బిడ్డింగ్ ద్వారా 2015లో రూ.55,636 కోట్లు రాగా, 2024లో రాయల్టీ రూపంలో రాష్ట్రాలకు రూ.2.69 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కీలకమైన ఖనిజాల అన్వేషణలో దేశం త్వరలో గ్లోబల్ లీడర్‌గా అవతరించనుందని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు అలాగే ఖనిజాలను పొందడానికి దేశం ప్రపంచ బిడ్‌లలో పాల్గొంటున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.

# మహా కుంభమేళాలో పాల్గొననున్న ప్రధాని మోదీ

ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సైతం మహాకుంభ్‌ను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది. ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ముర్ము మహాకుంభమేళాకు వెళ్లనున్నట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఈనెల 27న మహాకుంభమేళాకు హాజరుకానున్నట్లు తెలిసింది. త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించి గంగాపూజ నిర్వహించనున్నారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఇక ఫిబ్రవరి 1వ తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ సైతం ప్రయాగ్‌రాజ్ వెళ్లనున్నారు. ప్రముఖుల పర్యటన నేపథ్యంలో అధికారులు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. కీలక కూడళ్ళు, కార్యక్రమాల వేదికలపై నిఘా పెంచారు.

# దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి** పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. కాగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరుగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.

# ఆ ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వానిది కపటనాటకం

కళగం' నేత, నటుడు విజయ్ ధ్వజమెత్తారు. పరందూరు ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ 900 రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్న పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలు, రైతులనుద్దేశించి ఆయన ప్రచార వ్యాన్‌పై నుంచి ఉద్వేగంగా ప్రసంగించారు. విక్రవాండిలో పార్టీ మహానాడు తర్వాత ఆయన తొలిసారిగా తన రాజకీయ ప్రచారయాత్రకు పరందూరు నుంచి శ్రీకారం చుట్టారు. పరందూరులోని ఓ కల్యాణమండపం వద్ద గ్రామస్తులు, రైతులు, మహిళలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాదని, పంటపొలాలు, చెరువులు, వాగులతో సస్యశ్యామలంగా ఉన్న పరందూరు పరిసర ప్రాంతాలకు బదులు మరో చోట ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తే బాగుంటుందన్నారు. 900 రోజులకు పైగా పరందూరు పరిసర గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళనలపై రాహుల్ అనే బాలుడి ప్రసంగం వీడియో చూసిన తర్వాత ఇక్కడికి వచ్చి ఆందోళనకారులను కలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. పరందూరు సహా 13 గ్రామాలకు చెందిన అన్నదాతలకు తాను అండగా ఉంటానని, ఈ విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం చేసేందుకు కూడా తాను సిద్ధమేనన్నారు. తాను అన్నదాతల పాదాలకు నమస్కరించి తన రాజకీయ ప్రచార యాత్రను ప్రారంభిస్తున్నానని వెల్లడించారు. పార్టీ తొలి మహానాడులో పర్యావరణాన్ని కాపాడేందుకు పాటుపడతామని, వ్యవసాయ భూములను కాపాడతామని ప్రత్యేక తీర్మానాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్ట్ నిర్మించి ఈ గ్రామాలను ఎడారిగా మార్చటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఆరోపించారు.

# రియల్టర్ అనుచరుడిపై ఎంపీ ఈటల దాడి

**మొదటిపేజీ తరువాయి** ఎంపీకి చూపించారు. దీంతో ఈటల ఆవేశంతో వేగంగా వెళ్లి రియల్ వ్యాపారి అనుచరుడు రఫీక్ చెంప చెళ్లుమనిపించారు. వెంటనే ఈటల చుట్టూ ఉన్న ఆయన అనుచరులు కూడా ఆగ్రహంతో రఫీక్‌తోపాటు మరో వ్యక్తి గ్యార ఉపేందర్‌పైనా దాడి చేశారు. ఈ దాడిలో రఫీక్, ఉపేందర్‌లకు గాయాలయ్యాయి. రఫీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడు గాంధీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. కాగా, తమపై దాడికి పాల్పడ్డ ఎంపీ ఈటల రాజేందర్, ఆయన అనుచరులపై రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుచరుడు గ్యార ఉపేందర్.. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈటలతోపాటు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కాలనీ వాసులు శివారెడ్డి, జుబేర్ అక్రమ్, మరో 20 మంది కలిసి తమపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎంపీ ఈటల రాజేందర్‌పై ఫిర్యాదు అందిందని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ధ్రువీకరించారు.

– ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల రాజేందర్

ఏకశిలానగర్ ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ.. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎవరిపైనా చేయి చేసుకోలేదన్నారు. కానీ, ఈ వ్యవస్థను చూసి తట్టుకోలేక.. ప్రజల ఓట్లతో గెలిచిన బిడ్డగా పేదల పక్షాన నిలబడి ధర్మాన్ని కాపాడాటానికే ఈ విధంగా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. 'ఎంపీ వచ్చి ఏం పీకుతాడు?' అని వారు అన్నట్లు తనకు తెలిసిందని, వారికి ఇచ్చిన 'పనిష్మెంట్'ను తాను తప్పుగా భావించడం లేదని అన్నారు. అన్యాయానికి అండగా ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ఏకశిలానగర్‌లో దౌర్జన్యాలపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, నవీన్ మిత్తల్‌కు, కలెక్టర్‌కు, సీపీకి లేఖ రాస్తానన్నారు. వారు స్పందించి ప్రజల ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

# జనసేన కీలక నిర్ణయం

ఇవ్వాలని టీడీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగంగానే పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. దావోస్‌లో జరుగుతున్న పారిశ్రామిక పెట్టుబడుల సదస్సులోనూ మంత్రి టీజీ భరత్ మంత్రి లోకేష్ కాబోయే ముఖ్యమంత్రి అంటూ చంద్రబాబు ఎదుటే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సదస్సు పూర్తయిన తరువాత చంద్రబాబు మంత్రి భరత్‌కు క్లాస్ తీసుకున్నారు. ఎక్కడ ఏం మాట్లాడాలో తెలుసుకుని మాట్లాడాలని గట్టిగానే హెచ్చరించారు. ఇదిలా ఉండగా తమ నాయకులు పోటాపోటీగా చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు టీడీపీ, జనసేన అధిష్ఠానాలు నిర్ణయం తీసుకున్నాయి. డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ కూడా బహిరంగంగా మాట్లాడవద్దని టీడీపీ ఏపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పార్టీకి చెందిన నాయకులకు సమాచారం పంపారు.

# కేంద్రం గుప్పిట్లోకి విశ్వవిద్యాలయాలు

**మొదటిపేజీ తరువాయి** ముసాయిదా రూపొందించినట్లుగా ఉందని ఆరోపిస్తోంది. యూజీసీ తాజాగా రూపొందించిన ముసాయిదాపై అభిప్రాయాలను తెలియజేయాలంటూ పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది. ఇప్పటికే కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీన్ని వ్యతిరేకించాలని నిర్ణయించింది. యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా అమల్లోకి వస్తే.. వర్సిటీల్లో చాలా మార్పులు వస్తాయి. ముఖ్యంగా ఉపకులపతు(వీసీ)ల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదు. ప్రస్తుత విధానం ప్రకారం.. వీసీల నియామకాలకు తొలుత ప్రభుత్వం నుంచి ఒకరు, యూనివర్సిటీ నుంచి ఒకరు, యూజీసీ నుంచి మరొకరు సభ్యులుగా సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేస్తారు. సెర్చ్ కమిటీ వీసీ పోస్టుల కోసం ఐదుగురి పేర్లతో జాబితాను ప్రభుత్వానికి పంపిస్తుంది. వాటిని పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపిస్తుంది. గవర్నర్ ఆమోదం తర్వాత వీసీని నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ, తాజా ముసాయిదా ప్రకారం.. వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండదు. సెర్చ్ కమిటీల్లో యూజీసీ నుంచి ఒకరు, వర్సిటీ నుంచి ఒకరు, గవర్నర్ సూచించే మరో వ్యక్తి ఉంటారు. కమిటీ తన ప్రతిపాదనలను నేరుగా గవర్నర్‌కు పంపిస్తే, గవర్నర్ వీసీని ఎంపిక చేస్తారు.

# ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్ రాజ్ లో శ్రీవారి నమూనా ఆలయం

తొలిఅడుగు, అమరావతి : ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్ రాజ్ లో మహా కుంభ మేళా సందర్భంగా శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినట్లు టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలియజేశారు. ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయాన్ని టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు దంపతులు సోమవారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.ఆయనకు హెచ్ డిపిపి సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ ఇఒ గుణ భూషణ్ రెడ్డి, స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది సంక్రాంతి నుండి శివరాత్రి వరకు 45 రోజుల పాటు జరుగుతున్న ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభ మేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 250 మంది టిటిడి సిబ్బంది డిప్యూటేషన్ పై శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తరాదిలో ధర్మ ప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఉత్తరాది భక్తులందరూ శ్రీవారిని నమూనా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అయోధ్య శ్రీరాముడికి టిటిడి తరఫున తొలిసారిగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని, ఆ సందర్భంగా సరయూ నదీ తీరంలో స్వామివారికి వైభవంగా నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని తెలియజేశారు.

# జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



తొలి అడుగు ధర్మారం, జనవరి 21 : ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా మంగళవారం రోజున ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాఠశాలను సందర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించి అభినందించినట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ...జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన టీ. మనోజ్ఞ ఫుట్ బాల్ క్రీడలో జమ్ము కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం జరిగిందని, బి.సింధు ప్రియా వాలీబాల్ క్రీడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరిగిన జాతీయ స్థాయిలో పాల్గొనడం జరిగిందని, భీ.వైష్ణవి సాఫ్ట్ బాల్ ఎస్జీఎఫ్ అండర్ 19 మహారాష్ట్ర ఔరంగాబాద్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంనడం జరుగుతుందని అదేవిధంగా ఓ. సౌజ్ఞ శ్రీ గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడం జరిగిందని, ఏ రంజిత్ కుమార్ బీహార్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడం జరిగిందని, బి.అశ్రిత గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడం జరిగిందని ఇంకా పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరిని అభినందిస్తున్నామని తెలిపారు. సుమారుగా 30 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో,ఆరుగురు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందనీ,వారికి శిక్షణ ఇచ్చిన వారి పీఈటీ లను, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులను అభినందిస్తున్నామని ఈ సందర్భంగా 24 నుంచి 27 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి అండర్ 19 ఎస్జీఎఫ్ పోటీల్లో పాల్గొననున్న బి. వైష్ణవికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్ కోసం ఒక నెల జీతాన్ని చెక్కు రూపంలో ప్రిన్సిపాల్ అందజేస్తామని,అదే విధంగా పాఠశాలకు క్రీడా ప్రాంగణాన్ని,పాఠశాల ఆవరణలో జిమ్ ఏర్పాటు చేసి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్న వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్, ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య మేకల సంజీవరావు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పంపిణీ కొత్త రేషన్ కార్డ్ లు




తొలిఅడుగు, కద్తల్ జనవరి 21 : కద్తాల్ మండలం చల్లంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలలో కొత్త రేషన్ కార్డ్స్ మరియు పాత రేషన్ కార్డ్స్ ( మార్పులు - చేర్పులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా (భూమిలేని వ్యవసాయ కూలీలు) రైతు భరోసా (వివిధ అంశాల సమాచారం కోసం) ఇందిరమ్మ ఇండ్లు ( వివిధ అంశాల సమాచారం కోసం%ఒ%ఇది వరకు అప్లికేషన్ చేయని వారు) వంటి పథకాల కొరకు అర్హులైన ప్రతి ఒక్కరు అప్లికేషన్ తీసుకోవడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి అన్నారు. అందుబాటులో లేనివారు నిరంతర ప్రక్రియలో పై ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ చల్లా సురేందర్ రెడ్డి అన్నారు. చల్లా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ... ప్రజల ఆకాంక్షలు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మన తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మేరకు అర్హులైన ప్రజలందరికీ కొత్త రేషన్ కార్డులు సుధీర్యకాలంగా పెండింగ్లో ఉన్న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12'07'558 దరఖాస్తులు పరిశీలన చేసి ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు పరిశీలన అయినప్పటికీ ఉన్న పాత కార్డులు అన్ని యధావిధిగా కొనసాగుతాయని చల్లా సురేందర్ రెడ్డి అన్నారు. అలాగే ఇండ్లు లేని నిరుపేదలకు, రేకుల ఇండ్లకు శిథిలావస్థలో వున్న ఇండ్లకు గూడులేని నిరుపేదలందరికి ఇండ్లు ఇవ్వాలని ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను అని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కద్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, డిప్యూటీ తాసిల్దార్ ఆదిత్య రాజ్, అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష, చెల్లంపల్లి గ్రామ అధ్యక్షుడు తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పర్వతాలు యాదవ్, గుర్కా శివ, కిసాన్ సెల్ గ్రామ అధ్యక్షుడు నారాయణరెడ్డి, గుర్కా మల్లేష్, గాజుల గోపాల్ రెడ్డి, మరల్ల వెంకటేష్, ఇంద్రమ్మ కమిటీ మెంబర్స్. గ్రామ పెద్దలు. నాయకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

**- ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు,**

**రైతు భరోసా, పథకాలు నిరంతర ప్రక్రియ**




తొలిఅడుగు, కల్వకుర్తి, జనవరి 21 : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని అన్నారు.లబ్ధిదారుల లిస్టులో పేర్లు లేనివారు.. ఉంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులను పరిశీలించి అర్హులకే పథకాలు అందించేటట్లు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ ప్రాంత రైతాంగానికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరును అందించి రైతన్నల కాళ్లు కడుగుతామని తెలిపారు. అదేవిధంగా వెల్జాల్ సహదేవి సముద్రాన్ని కృష్ణానది జలాలతో నింపుతామని అన్నారు.వెల్జాల గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన నూతన మండల ఏర్పాటుకు సహకరిస్తానని కనీసం 5ఎంపిటిసిల స్థానాల నుంచి గ్రామసభ తీర్మానాలు తెచ్చినట్లయితే మండల ఏర్పాటు కొరకు కృషి చేస్తానని,అదేవిధంగా వెల్జాల్ కేంద్రంలో రైతు సహకార సంఘం (పిఎసిఎస్) ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే వెల్జాల గ్రామంలో(పి హెచ్ సి) ప్రాథమిక హెల్త్ సెంటర్ 10 పడకల ఆసుపత్రిని నిర్మించడానికి కృషి చేస్తానని అన్నారు.గత పాలకుల నిర్లక్ష్యం వలన వెల్జాల్ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని,ఈ ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహా ముదిరాజ్, వైస్ చైర్మన్ గూడూర్ భాస్కర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏ భగవాన్ రెడ్డి, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్,ఎంపీడీవో శ్రీకాంత్, ఎమ్మార్వో నాగార్జున, ఏపీఓ కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చర్ల వెంకట్ రెడ్డి, ఆజీమ్, శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ జెడ్పి కో ఆప్షన్ ముజి బుర్ రహ్మాన్ మాజీ ఎంపీటీసీ జి శ్రీనివాస్ మూర్తి, నాయకులు కే.నర్సిరెడ్డి ,ఏ.అంజయ్య గౌడ్, పి అశోక్ బాబు, కే యాదగిర్ రెడ్డి, టి.గోపాల్ రెడ్డి,పి రమేష్ యాదవ్, బి.నరసింహులు, పి దశరథం ఎంఏ అజీజ్, పబ్బతి వెంకటయ్య,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, టీ ప్రదీప్ రెడ్డి, అబ్బాస్, లక్ష్మణ్ , వి రాజు, పులిజాల విష్ణు, తుపాకుల పవన్, ఎండి రహమత్, గ్రామపంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామ మహిళలు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం:



తొలిఅడుగు, కల్వకుర్తి, జనవరి 21 : వెల్దండ మండలం లోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కొరుపూరు బుచ్చయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. గురించి సిద్ధగొని రమేష్ గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ మరియు అజిలాపూర్ గ్రామ సిద్ధ గొని రమేష్ గౌడ్ సహకారంతో కుర్వూరి బుచ్చయ్య కుటుంబానికి ?3000 ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. అట్లాగే. కొట్ర కరుణాకర్ రెడ్డి .కొప్పు కృష్ణయ్య. కొప్పుల రవికుమార్ గౌడ్ . మొత్తం ఆ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ తరపున ?5000 రూపాయలు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిద్ధగొని రమేష్ గౌడ్ మాజీ ఉప్ప ఉప సర్పంచ్లు కరుణాకర్ రెడ్డి కృష్ణయ్య మాజీ గ్రామ రైతు కమిటీ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ జంగయ్య కుర్వూర్ రవి సోమయ్య కుర్వూర్ జంగయ్య కురుపూరు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెం సిసి రోడ్లు ప్రారంభం



తొలి అడుగు జంగారెడ్డిగూడెం, జనవరి 21 : జంగారెడ్డిగూడెం పురపాల సంఘ పరిధిలో గల 25 వార్డులు గతంలో సాధారణ నిధుల నుండి 32 లక్షల వెచ్చించి, సిసి రోడ్లు ప్రారంభించడం జరిగింది. కానీ అప్పటి ఎన్నికల కారణంగా సిసి రోడ్ల పనులు వాయిదా వేయడం జరిగింది. మరలా ఇప్పుడు ఆ రోడ్డును ఈరోజు మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటరమణ, కోపరేషన్ డైరెక్టర్ చిట్టి బోయిన రామలింగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు బత్తిన చిన్న, గుబ్బల అబ్బాస్, గెద్దాడ శ్రీనివాసరావు, కొంచెం మట్టి ప్రకాష్, తల్లాడ శ్రీను, జహీర్, వైఎస్ఆర్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొలిక్కిరాని చెముడులంక శ్రీనివాస్ నగర్ రోడ్డు సమస్య

తొలి అడుగు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. ఆలమూరు, జనవరి 21 : ఇరవై రోజులుగా జరుగుతున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక శ్రీనివాస్ నగర్ కాలనీ రోడ్డు సమస్య కొలిక్కి రాలేదు. సోమవారం ఆ కాలనీ వాసులు ఆలమూరులో జరిగే ప్రజా పరిష్కార వేదికలో తాసిల్దార్ ప్రకాష్ బాబు, ఎంపీడీవో రాజు లకు ఫిర్యాదు చేశారు. సుమారు 50 కుటుంబాలు ఉండే ఆ కాలనీకి మూడున్నర దశాబ్దాలుగా ఉన్న రోడ్డు మార్గాన్ని అక్కడ రైతులు తవ్వేసారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. లారీ తిరిగే ఆ రోడ్డు ఇప్పుడు నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా గోతులు పెట్టేసారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ వారు వేసిన గ్రావెల్ రోడ్డు తవ్వేయడం అన్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మాకు రాకపాకులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని వెంటనే మా సమస్య పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై ఎంపీడీవో రాజు గ్రామ పెద్దలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. అయితే బత్తుల పెద్దకాపు అనే రైతు వాదన మరోలా ఉంది. తన పొలంలో శ్రీనివాస్ నగర్ వెళ్లే రోడ్డు ఉందని అయినప్పటికీ ప్రజల కోసం తాను ఎప్పుడూ అభ్యంతరం పెట్టలేదన్నారు. అయితే ఇప్పుడు ఆ పక్కన ఉన్న తన పనిలోకి వచ్చే వేరే రోడ్డును అడబాల రామకృష్ణ మార్గం లేకుండా చేశారని తన సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. తన పొలంలోకి వచ్చే రోడ్డును యధావిధిగా కొనసాగిస్తే శ్రీనివాస్ నగర్ కాలనీ రోడ్డు ఇవ్వడానికి అభ్యంతరం లేదని వివరించారు. అయితే రామకృష్ణ అందుకు అంగీకరించడం లేదు.తనకు చెందిన స్థలం నుంచి రోడ్డు ఇవ్వనని పట్టుపట్టారు.సోమవారం పొద్దిపోయే వరకు ఇరు వర్గాలతో చర్చలు



జరిపినా కొలిక్కి రాలేదు. దీంతో మంగళవారం మరోసారి ఇరువర్గాల వారిని గ్రామ పెద్దలను ఆలమూరు ఆఫీసు రావాలని ఎంపీడీవో రాజు సూచించారు.

# మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు



తొలి అడుగు, జంగారెడ్డిగూడెం, జనవరి 21 : జంగారెడ్డిగూడెం మండలం, గురవాయిగూడెం గ్రామంలో మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఈరోజు మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకలసి స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తమలపాకులతో విశేష పూజలు జరిగాయి, స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు ఇచ్చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ స్వామి తమ కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు కొలుస్తారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవలరూపణ రూ1,30,0419 లు సమకూరినది. సుమారు 1200 మంది భక్తులు స్వామివారి నిత్యానంద సత్రం నందు అన్న ప్రసాద్ వితరణ చేశారు. దర్శనం విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యముల కలక్కుండా పర్యవేక్షకులు జవాది కృష్ణ, కొరగంటి రంగారావు పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిని ఆర్ వి చందన తెలియజేశారు.

# డిప్యూటీ సీఎం పదవికి వన్నె తెచ్చిన నాయకుడు పవన్ కళ్యాణ్

- గారపాటి శ్రీనివాస్ చౌదరి,
- చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు



తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, జనవరి 21 : పెదపళ్ళ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా ఆ పదవికి వన్నెతెచ్చిన ఘనత మా నాయకుడు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు దక్కుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల జనసేన పార్టీ నాయకుడు, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. ఆలమూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో ఒక్కరే సీఎం, ఒక్కరే డిప్యూటీ సీఎం ఉంటారని, ఉమ్మడి కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. తెలుగుదేశం నాయకులు, వైసిపి వారి మాయ మాటలలో పడకుండా, జనసేన, బిజెపితో మరింత ఐకమత్యంగా ముందుకు సాగాలని కోరుకుంటూ, ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ వారు ప్రజా సేవలో నీతి నిజాయితీగా ముందుకు సాగుతూ ఉన్నారని, ఎప్పుడూ ఎక్కడ అవినీతికి పాల్పడని, గొప్ప నాయకుడు ఒక పవన్ కళ్యాణ్ మాత్రమేనని చెప్పారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవే, తన ధ్యేయమని, ప్రజల కోసం, రాష్ట్రం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం, ఆంధ్ర రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతి కోసం రైతుల భవిష్యత్తు కోసం యువత భవిష్యత్తు కోసం, జనసేన పార్టీని, దేశంలోనే ఒక గొప్ప పార్టీగా నిలబెట్టిన మహెూన్నతమైన వ్యక్తిత్వం ఉన్న, మా నాయకుడు ఒక పవన్ కళ్యాణ్ మాత్రమేనని, మేము గర్వంగా ఒక జన సైనికుడిగా చెప్పగలను. గత వైసిపి ప్రభుత్వం లో నలుగురైదురు డిప్యూటీ సీఎంలుగా చేసినా, రాష్ట్ర ప్రజలకు ఎవరు ఏనాడు వారు ప్రజలకు గుర్తు లేరని, డిప్యూటీ సీఎం పదవికి ఒక్క పవన్ కళ్యాణ్ మాత్రమే వన్నె తెచ్చారని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుర్తుండేలా ఆంధ్ర రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను పెంచి, దేశ ప్రజలకు గుర్తుండేలా, ఉమ్మడి కూటమి ప్రభుత్వానికి వన్నెతెచ్చిన, గొప్ప నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఉన్నారని, మన దేశ రాజకీయాలలో ఉమ్మడి కూటమి ప్రభుత్వానికి, ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ సారధ్యంలో, హెూం శాఖ కేంద్ర మంత్రి శ్రీ అమిత్ షా తర్వాత స్థానంలో, భారత దేశంలో అత్యంతశక్తివంతమైన నాయకుడిగా పవన్ కళ్యాణ్ మాత్రమే ఉన్నారని, అంతటి మహెూన్నతమైన వ్యక్తికి, మరి ఎవరు సాటి రారని, డిప్యూటీ సీఎం పదవికి వన్నె తెచ్చేది ఒక్కరే ఉండాలని, అది మా నాయకుడు పవన్ కళ్యాణ్ మాత్రమే ఉండాలని కోరుకుంటూ, భవిష్యత్తులో మా నాయకుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఉన్నామని, అదేవిధంగా కొత్తపేట నియోజకవర్గంలో, జనసేన పార్టీకి తిరుగు లేదని, కొత్తపేట నియోజకవర్గ%శీ% జనసేన పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాస్ నాయకత్వం ఎంతో పటిష్టమైన స్థితిలో నాలుగు మండలాల్లోనూ ఉన్నదని బండారు శ్రీనివాస్ నాయకత్వంలో పనిచేయడం మేము ఎంతో గర్వపడుతూ ఉన్నామని, రేపటి ఎమ్మెల్యేగా బండారు శ్రీనివాస్ ని చూడాలని జనసేన సైనికులు కోరుకుంటున్నారని గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు.

# టవర్ ఏదైనా సెల్ సిగల్ పొందచ్చు

తొలి అడుగు, నెట్‌వర్క్ ఏదైనా 4జి మొబైల్ సేవలు పొందేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌ను ప్రారంభించింది. డిజిటల్ భారత్ నిధి (డిబిఎన్) క్రింద ఏర్పాటు అయినటువంటి టవర్ల ద్వారా బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ కలిగిన ఏ వినియోగదారులు అయినా 4జి సేవలను పొందవచ్చు. ఈ సేవలను కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా లాంచనంగా ప్రారంభించారు. ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌తో వినియోగదారులు ఇప్పుడు భాగస్వామ్య నెట్‌వర్క్‌లను వినియోగించుకుని అంతరాయం లేని మొబైల్ సేవలు పొందవచ్చని కేంద్రం పేర్కొంది. దీంతో గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో కనెక్టివిటీ అంతరాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా 4జి సేవలను అందించడానికి 35,400 గ్రామాలకు గాను దాదాపు 27,000 మొబైల్ టవర్‌లకు నిధులు సమకూర్చింది. ఈ విధానం విస్తతమైన కవరేజీని అందించడంలో భాగంగా అనవసరమైన మౌలిక సదుపాయాల కొరతను తగ్గిస్తుందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 27,836 ప్రాంతాలను కవర్ చేస్తుందని మంత్రి సిందియా పేర్కొన్నారు.

# జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేత

తొలి అడుగు, జంగారెడ్డిగూడెం, జనవరి 21 : జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్ మరి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ, ఏలూరు జిల్లా కమిటీ పిలుపుమేరకు ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్ మరియు సెక్యూరిటీ సిబ్బంది. ఈనెల 24 నుంచి నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని, ఏఐటియ సి, మండల కార్యదర్శి కుంచే వసంతరావు, గౌరవ అధ్యక్షులు చెంపన వెంకటరమణ రాజు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ మరియు సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం హాస్పటల్ సూపరెంటెంట్ కు వింత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులకు కనీస వేతనం, 26 వేల రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్టు ఏజెన్సీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని గత నెలలో భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించడం జరిగిందని, కాంట్రాక్ట్ అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ మేరకు ఆందోళన విరమించడం జరిగిందని అన్నారు. కానీ నేటికీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోవడం తో తప్పనిసరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పిలిపి ఇవ్వడం జరిగిందన్నారు. చాలీచాలని వేతనాలతో కడు దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న పారిశుద్ధ కార్మికులకు ప్రభుత్వానికి ఏజెన్సీల పేరిట దళారుల వ్యవస్థ కొనసాగించడం సహితకము కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఒకటైన కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్పిటల్లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు ప్రభుత్వం నుండి వారి శ్రమకు ఎంత వేతనం వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో



కాంట్రాక్ట్ దయాదాక్షణేలపై కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్న విధంగా పరిస్థితి ఉందని సరికాదని ఆయన అన్నారు. ఇప్పటికైనా కార్మికులకు జీతాలు చెల్లించలేని అసమర్థ కాంట్రాక్టు ఏజెన్సీ వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన నాలుగు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా హాస్పిటల్స్ లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేరీ, దా యామని, వేముల రాజు, తాళ్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

విశాఖ ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే!

కేంద్ర ప్రభుత్వ "క్యానెబిట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్" (సి.సి.ఇ.ఎ) ప్రధాన మంత్రి మోడీ అధ్యక్షతన జనవరి 17న జరిగిన సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రివైవల్ ప్యాకేజీ కోసం రూ.11,440 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. ఎన్‌డిఎ ప్రభుత్వం 6 నెలలు కష్టపడి ఉక్కు సంకల్పంతో సాధించిన ఘన విజయంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ అధినేతలు ప్రకటించారు. విశాఖ స్టీల్‌ను 100 శాతం ప్రైవేటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుమారు గత నాలుగు సంవత్సరాల కాలంలో.. రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మిక వర్గం నిరంతర పోరాట ఫలితంగానే ఈ ప్యాకేజీ సాధ్యమైంది. స్టీల్ కార్మికులు, ప్రజలు పోరాడి సాధించుకున్న ప్యాకేజీ ఇది. ఈ ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం దేనికి ఖర్చు పెడుతుందో ముందు ముందు చూడాలి. అయితే ఈ ప్యాకేజీ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఈ ప్యాకేజీని అందరూ ఆహ్వానిస్తున్నారు. అయితే ప్లాంటుకు ముఖ్యం స్వంత గనులు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11,440 కోట్లలో రూ.1140 కోట్లు షేర్ ధనానికి అసలు, వడ్డీతో సహా కేంద్ర ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలి. ఈక్విటీగా కేటాయించిన రూ.10,300 కోట్లలో ఇప్పటికే రూ.1200 కోట్లు విశాఖ స్టీల్‌కు వినియోగించారు. కార్మికుల పి.ఎఫ్, జీతాలకు ఇందులో రూ. 1000 కోట్ల బకాయిలు చెల్లించాలి. 2025 ఆగస్టు నాటికి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపి పూర్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి ఉత్పత్తి సాధించడానికి సాలీనా రూ.18 వేల కోట్లు ముడి ఖనిజాలకు ఇప్పటి రేట్ల ప్రకారం ఖర్చు అవుతుంది. రెండు సంవత్సరాలలోనైనా 100 శాతం సామర్థ్యం సాధించడానికి ఇప్పుడు కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవు. కేవలం 7 లక్షల టన్నుల సామర్థ్యం వున్న కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు రూ.18 వేల కోట్లు కేంద్రం కేటాయించింది. ఇద్దరు ఎంపీలతో కర్ణాటక రూ.18 వేల కోట్లు సాధించినా అక్కడ ఇంత ఆర్భాటం చేయలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో గొప్పగా ప్రచారం చేయడం సంకీర్ణ ప్రభుత్వ ఘనత. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలని నిర్ణయించిన 2021-22 సంవత్సరంలో కూడా విశాఖ స్టీల్ రూ.913 కోట్లు నికర లాభాలార్జించింది. రూ.28,215 కోట్లు అత్యధికంగా టర్నోవర్ పొందింది. గత మూడు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం, అదాని పోర్టులు ఉత్పత్తిని అడ్డుకుని విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టాయి. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి నిజాయితీతో కేంద్ర ప్రభుత్వం నిలబడితే ఈ నష్టాలు విశాఖ స్టీల్‌కు లెక్కలోకి రావు. 1991 నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్క కోటి రూపాయలు కూడా విశాఖ స్టీల్‌కు కేటాయించక పోయినా స్వంత లాభాలతో రూ. 22 వేల కోట్లు వెచ్చించి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి చేరింది. భారీ స్టీల్ ప్లాంట్లకు ముడి ఖనిజమే ప్రధాన పెట్టుబడి. ముడి ఖనిజాల్లో ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ప్రధానమైనవి. 2000 సంవత్సరం నుంచి ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2000 సంవత్సరంలో మార్కెట్‌లో టన్ను ఇనుప ఖనిజం రూ. 500 ఉంటే నేడు టన్ను 6000 నుండి 8000 రూపాయల వరకు ఎగబాకింది. కోకింగ్ కోల్ మన దేశంలో లభ్యం కాదు. విదేశాల నుండి దిగుమతి చేసుకుంటాం. 2018లో 48 డాలర్లు ఉన్న కోకింగ్ కోల్ ధర నేడు టన్ను 240 డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో పుష్కలంగా ఇనుప ఖనిజం లభించే దేశాలలో భారతదేశం ఒకటి. కేంద్ర ప్రభుత్వం మన దేశంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్లకు ఇనుప ఖనిజం 100 సంవత్సరాలకు సరిపడా కేటాయించింది. టాటా, భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా వంటి స్టీల్ ప్లాంట్లు అన్నింటికీ ముడి ఖనిజం సమృద్ధిగా వుంది. వారితో విశాఖ స్టీల్ పోటీ పడాలి. మార్కెట్‌లో అన్ని స్టీల్‌ప్లాంట్ల అమ్మకాల రేట్లు ఒక్కటే. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం 1957 సెక్షన్ 17(1)(బి) ప్రకారం ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ముడి ఖనిజం గనులు కేటాయించాలని ముడి ఖనిజం గనుల చట్టంలో స్పష్టంగా వుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనుల కేటాయింపు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణ సమయంలో 1985లో విడుదల చేసిన డి.పి.ఆర్ ప్రకారం ఎన్.ఎమ్.డి.సి (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్), బైలదిలా లోని నాలుగు, ఐదు బ్లాకుల్లో స్వంత గనులు విశాఖ స్టీల్‌కు కేటాయించాలి. ప్రభుత్వ రంగంలో 1990లో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కావాలనే, ప్రైవేటు చేయడానికే కేంద్ర ప్రభుత్వాలు స్వంత గనులు కేటాయించలేదు. స్వంత గనులు కేటాయిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ బలపడుతుంది. స్టీల్ రంగంలో విశాఖ స్టీల్ తిరుగులేని శక్తిగా ఎదుగుతుంది. పాలకులు వారి ఇష్టం వచ్చిన ప్రైవేటు కంపెనీలకు విశాఖ స్టీల్‌ను కారుచౌకగా కట్టబెట్టాలనే దురుద్దేశంతోనే విశాఖ స్టీల్‌కు నేటికీ స్వంత గనులు కేటాయించడానికి నిరాకరిస్తున్నారు. కనీసం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయాలన్న కార్మికుల డిమాండ్‌ను బి.జె.పి పాలకులు ఖాతరు చేయడంలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోకెల్లా సముద్ర తీరంలో 20 వేల ఎకరాల స్వంత భూములలో ఏర్పడిన ఏకైక భారీ స్టీల్ ప్లాంట్. నవరత్న గుర్తింపు పొందిన ఏకైక స్టీల్ ప్లాంట్ కూడా ఇదే. బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాజేయడానికి కార్పొరేట్లు పోటీ పడుతున్నారు. వాటిని ప్రతిఘటించి విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా విశాల ఐక్య ఉద్యమం సాగించాలి. కార్మికుల పోరాటం, ప్రజల సంఘీభావం పరిఢవిల్లాలి.

# మంత్రి సభ ఏర్పాట్లను పరిశీలించిన విప్

తొలిఅడుగు, ధర్మపురి, జనవరి 21 : ప్రజపాలనలో భాగంగా బుధవారం రోజున ధర్మపురి మండలం జైన గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో పాల్గొనడానికి విచ్చేస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మీటింగ్ కి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ, అధికారులు మండల నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు.



# గ్రామసభలో అధికారుల నిలదీత

తొలిఅడుగు, నంగునూరు, జనవరి 21 : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమకుల గ్రామంలో కొత్త రేషన్ కార్డులు, రైతు ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు వాటిపై ప్రభుత్వం గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉద్దేశంతో ఈరోజు పాలమాకుల గ్రామంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఎమ్మార్వో సరిత రేషన్ కార్డుల గురించి లిస్టులో వచ్చిన వారి పేర్లు చదివి వినిపించగా గ్రామంలో ఉన్న వారు మేము కూడా అర్హులమే మా పేరు ఎందుకు రాలేదని గ్రామ సభలో అధికారులను నిలదీయడం జరిగింది అనంతరం ఎమ్మార్వో సరిత మరియు డిపిఓ దేవకి దేవి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. ప్రజలందరూ సమన్వయంతో ఉండి గ్రామసభను నడిపించుకోవాలని కోరారు. అయినా గ్రామస్తులు మాకెందుకు రాలేదని నిలదీయడంతో పోలీస్ పహారా లో మధ్య గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి మండల ఎమ్మార్వో స్పెషల్ ఆఫీసర్ సరిత ఏఈఓ చైతన్య గ్రామపంచాయతీ సెక్రెటరీ అనిత గ్రామ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రు 50 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే జి ఎం ఆర్
- కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ కొలను రోజా బాలిరెడ్డి మరియు కౌన్సిలర్లు
- కాలుష్య జలాల నుండి ఇక శాశ్వత విముక్తి..
- అభివృద్ధిలో ఆదర్శంగా బొల్లారం మున్సిపాలిటీ..




తొలి అడుగు, బొల్లారం మున్సిపల్ : చరిత్రలోనే ఒకేరోజు 50 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారాలతో బొల్లారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పనిచేయడమే తనకు తెలుసునని.. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలకు నష్టం చేకూర్చిన వాళ్ళం అవుతామని వ్యాఖ్యానించారు. మంగళవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో సుమారు 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల పనులకు శంకుస్థాపన చేశారు. పలు కాలనీలలో పూర్తయిన రోడ్లను ప్రారంభించారు. అనంతరం 26 కోట్ల 50 లక్షల రూపాయలతో జలమండలి ద్వారా నిర్మించిన రిజర్వాయర్ల నుండి ఇంటింటికి మంచినీటి సరఫరా వ్యవస్థను ప్రారంభించడంతోపాటు పంప్ హౌస్ ను ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బొల్లారం గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం పాలకమండలితో కలిసి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం జరిగిందని తెలిపారు. 26 కోట్ల 50 లక్షల రూపాయలతో భారీ రిజర్వాయర్లు, పంప్ హౌస్ నిర్మించి ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడం సంతోషకరంగా ఉందన్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కువ శాతం నిరుపేద మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారని.. వారి ఆర్థిక అభివృద్ధికి సైతం సంపూర్ణ సహకార అందిస్తున్నామని తెలిపారు.

## ఖాళీ కడుపుతో ఎక్సర్‌సైజ్ చేయడం మంచిదేనా?



**తొలిఅడుగు, ఆరోగ్యం :** చాలా మందికి ఉదయాన్నే కాసేపు వ్యాయామం చేయడం అలవాటు. నిద్ర లేచిన వెంటనే ఠంఛన్‌గా వ్యాయామం మొదలు పెడుతుంటారు. అయితే ఉదయం పూట ఖాళీ కడుపుతో చేయాలా? లేదంటే ఏదైనా తిని వ్యాయామం చేయాలా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ ప్రశ్నకు సమాధానం ఈ కింద తెలుసుకోవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా? ఈ ఆలోచన రాగానే మనసులో మెదిలే మొదటి విషయం వ్యాయామం. కొందరు బరువు తగ్గేందుకు రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. కొందరు జిమ్‌కి పరిగెత్తుతుంటారు. త్తారు. చాలా మంది రెగ్యులర్ గా వర్క్ అవుట్ చేస్తుంటారు. పొద్దున్నే వర్కవుట్ చేస్తే బరువు కూడా వేగంగా పడిపోతుంది. నిజానికి రాత్రిపూట నిద్రపోయిన తర్వాత, శరీరంలో గ్లైకోజెన్ (స్టెరాయిడ్ కార్బోహైడ్రేట్లు) తగ్గుతుంది. ఫలితంగా, ఉదయాన్నే మేల్కొన్నప్పుడు గ్లైకోజెన్‌కు బదులుగా, కొవ్వు వేగంగా ప్రవహిస్తుంది. అందుకే ఉదయాన్నే ఖాళీ కడుపుతో వర్కవుట్ చేయాలా వద్దా అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. చాలా మంది ఖాళీ కడుపుతో పని చేయడం సుఖంగా ఉంటుంది. అయితే కొంతమంది మాత్రం ఇలా చేయడం వల్ల ఇబ్బందుల్లో పడతారు. నిజానికి ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం మంచిది కాదు. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును త్వరగా తగ్గించుకోవడం మంచిదే. కానీ ఖాళీ కడుపుతో వ్యాయామం చేస్తే, గ్లైకోజెన్ నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరం బలహీనంగా మారేలా చేస్తుంది. అలాంటప్పుడు వ్యాయామం చేయడం కష్టంగా మారుతుంది. కాబట్టి ఉదయాన్నే కాస్త తక్కువగా తిని, వ్యాయామం చేయడం వల్ల ప్రయోజనం పొందొచ్చు. అయితే ఇప్పుడు వచ్చే మరో ప్రశ్న.. ఉదయాన్నే ఏం తినాలి? వ్యాయామానికి ముందు అరటిపండు తినవచ్చు. అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి బలం చేకూరుతుంది. ఇందులో ఉండే పిండి పదార్థాలు, పొటాషియం కండరాలు, నరాలను చురుకుగా ఉంచుతాయి. అరటిపండ్లు లేదా యాపిల్ తిని కూడా వ్యాయామం చేయవచ్చు. యాపిల్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉండటానికి సహాయపడుతుంది. ఫలితంగా బరువు తగ్గుతారు. కడుపు నిండా తిన్న తర్వాత వ్యాయామం చేయడం కష్టంగా అనిపిస్తుంది. అందుకే లైట్‌గా తీసుకుంటే శరీరం తేలిగ్గా ఉంటుంది. చకచకా వ్యాయామం చేయొచ్చు.

## కుంకుమపువ్వు పాలు.. ఆరోగ్యానికి లాభామా!



**తొలిఅడుగు, ఆరోగ్యం :** కుంకుమ పువ్వును గోల్డెన్ స్పైస్ అని అంటారు. దీన్ని గోరు వెచ్చని పాలలో కలిపి తాగడం వల్ల మానసిక, శారీరక ప్రయోజనాలను పొందవచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. కుంకుమపువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పాలు తాగితే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. శరీరానికి కాల్షియం, విటమిన్ డి, ఫాస్ఫరస్ వంటి అవసరమైన పోషకాలు అందుతాయి. కుంకుమ పువ్వు పాలు తాగితే మానసిక సమస్యలు దూరం అవుతాయి. ఈ పాలు తాగడం వల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది. ఒత్తిడి మాయం అవుతుంది. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగడం వల్ల పేగులు కదలికలు ఆరోగ్యంగా మారుతాయి. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు రావు. అజీర్తి, మలబద్ధకం కంట్రోల్ అవుతుంది. కుంకుమ పువ్వులో క్రోసిన్, సఫ్రానల్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి వ్యాధి నిరోశధకశక్తిని పెంచుతాయి. కుంకుమ పువ్వు పాలు తాగితే ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండొచ్చు. కంటి ఆరోగ్యాన్ని కాపాడతాయి. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. కుంకుమ పాలలో ఉండే క్రోసిన్ వంటి సమ్మేళనాలు జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అభిజ్ఞా పనితీరు మెరుగుపరుస్తాయి. కుంకుమ పువ్వు పాలు తాగితే మానసిక సమస్యలు దూరం అవుతాయి. ఈ పాలు తాగడం వల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది. ఒత్తిడి మాయం అవుతుంది. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగడం వల్ల పేగులు కదలికలు ఆరోగ్యంగా మారుతాయి. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు రావు. అజీర్తి, మలబద్ధకం కంట్రోల్ అవుతుంది. కుంకుమ పువ్వు పాలు తాగడం వల్ల లంగ్స్ హెల్త్ మెరుగుపడుతుంది. కుంకుమ పాలలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శ్వాస సమస్యలను దూరం చేస్తాయి. దగ్గు, జలుబు, ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. కుంకుమ పాలలో ఉండే పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కుంకుమ పాలు తాగితే కొలెస్ట్రాల్ కరుగుతుంది. గుండె పనితీరు మెరుగుపడుతుంది.


## నిద్రకోసం మాత్రలు వేసుకుంటున్నారా?



**తొలిఅడుగు, ఆరోగ్యం :** మరింత తీవ్రమైన సమస్యల విషయంలో డాక్టర్ నిర్ణీత పరిమాణంలో సిఫార్సు చేస్తే, అది సురక్షితంగా ఉంటుంది. కానీ సాధారణ సమస్యలలో కూడా తీసుకుంటే, అది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపడం ఖాయం. అందువల్ల, దానిని తీసుకోకుండా ఉండాలంటున్నారు పరిశోధకులు. చాలా మందికి నిద్రలేమి సమస్య ఉంటుంది. దీంతో కొందరు నిద్రమాత్రలు వేసుకునే అలవాటు చేసుకుంటారు. ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. మీ మూత్రపిండాలు, కాలేయం రెండూ దెబ్బతింటాయి. అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ నివేదికలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచంలోని పెద్దవారిలో మూడింట ఒకవంతు మంది నిద్రలేమి సమస్యతో పోరాడుతున్నారు. దీని వల్ల చాలా మంది నిద్రమాత్రలు వేసుకోవాల్సి వస్తోంది. ఈ మందులు చాలా దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి. అటువంటి పరిస్థితిలో డాక్టర్ సలహా లేకుండా వాటిని తీసుకోకుండా ఉండాలి. నిద్రమాత్రల వల్ల కలిగే నష్టాలు ఏమిటో తెలుసుకుందాం. నిద్ర సమస్యలతో బాధపడేవారికి స్లీపింగ్ మాత్రలు ఉపయోగపడతాయి. తీవ్రమైన నిద్రలేమి సమస్యల విషయంలో వైద్యులు ఈ మందులను ఇస్తారు. స్లీపింగ్ పిల్స్ మెదడులోని రసాయనాలను ప్రభావితం చేస్తాయి. ఆ రసాయనాలు నియంత్రిస్తాయి. ఆ తర్వాత నిద్రలో సమస్య ఉండదు. మరింత తీవ్రమైన సమస్యల విషయంలో డాక్టర్ నిర్ణీత పరిమాణంలో సిఫార్సు చేస్తే, అది సురక్షితంగా ఉంటుంది. కానీ సాధారణ సమస్యలలో కూడా తీసుకుంటే, అది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపడం ఖాయం. అందువల్ల, దానిని తీసుకోకుండా ఉండాలంటున్నారు

# స్వెటర్లు, సాక్స్ ధరించి నిద్రపోతున్నారా?

**తొలిఅడుగు, ఆరోగ్యం :** చలికాలంలో వాతావరణం చల్లగా ఉండటం వల్ల రాత్రిళ్లు చలి తీవ్రంగా ఉంటుంది. దీంతో వెచ్చగా ఉండేందుకు చాలా మంది స్వెటర్లు, సాక్స్ వంటి దళసరి వస్త్రాలు ధరించి నిద్రిస్తుంటారు. అయితే ఈ పద్ధతి ఆరోగ్యానికి ప్రమాదకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ఇలా నిద్రించడం వల్ల గుండె ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందట. చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి రకరకాల పద్ధతులను అనుసరిస్తాం. వెచ్చగా ఉండటానికి దళసరి బట్టలు ధరించడం, స్వెటర్స్, సాక్స్‌లు వంటివి ధరించడం చేస్తుంటాం. అయితే కొంత మంది మాత్రం రాత్రిపూట స్వెటర్లు, సాక్స్‌లతో నిద్రపోతుంటారు. వెచ్చగా నిద్రపోవడానికి ఈ విధానం సౌకర్యవంతంగా అనిపించవచ్చు. కానీ స్వెటర్లు, సాక్స్‌లతో నిద్రించే అలవాటు ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. చలికి దూరంగా ఉండాలంటే వెచ్చటి బట్టలు వేసుకుని పడుకోవడం మంచిదని కాదని హెచ్చరిస్తున్నారు. మనం నిద్రపోతున్నప్పుడు శరీరం ఒక ప్రత్యేక పద్ధతిలో పనిచేస్తుంది. వెచ్చని దుస్తుల్లో నిద్రిస్తున్నప్పుడు ఈ ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది. ఇది వివిధ శారీరక సమస్యలకు దారి తీస్తుంది. చలి నుంచి బయటపడేందుకు స్వెటర్లు, సాక్స్‌లతో నిద్రించే అలవాటు చర్మం, రక్త ప్రసరణ, నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట స్వెటర్‌తో నిద్రపోవడం వల్ల గుండె జబ్బులను ఆహ్వానించడమే అవుతుంది. నిజానికి ఉన్ని వస్త్రాల్లో దట్టమైన ఫైబర్స్ ఉంటుంది. ఇది శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. రాత్రిపూట శరీర ఉష్ణోగ్రతతో పాటు వెచ్చగా ఉండటానికి ఉన్ని బట్టలు ధరిస్తే.. అధిక శరీర వేడి కారణంగా మధుమేహం, గుండె జబ్బు రోగులకు హానికరం. చలికాలంలో శరీరంలో ఉండే రక్తనాళాలు కుచించుకుపోయి చిన్నవిగా మారతాయని వైద్యులు చెబుతున్నారు. అదే ఉన్ని బట్టలు ధరించి నిద్రిస్తున్నప్పుడు, శరీరం వేడిగా మారుతుంది. ఇలా వేడెక్కడం వల్ల విశ్రాంతి లేకపోవడం, భయం, తక్కువ రక్తపోటు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే కాటన్ దుస్తులు ధరించి రాత్రిళ్లు నిద్రపోవాలి. ఇది శరీర ఉష్ణోగ్రతను సాధారణంగా ఉంచుతుంది. రాత్రి బాగా నిద్రపడుతుంది.



ఉన్ని వస్త్రాలు శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. కాబట్టి, స్వెటర్లు, సాక్కులు ధరించి నిద్రిస్తే, చెమట అధికంగా పట్టవచ్చు. చెమట వల్ల చికాకు, దురద, అలెర్జీలకు కూడా వస్తాయి. పొడి చర్మం ఉన్నట్లయితే, ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది. కాబట్టి రాత్రిపూట ఇలాంటి దుస్తులకు దూరంగా ఉండటం మంచిది. మంచి నిద్ర కోసం చలికాలంలో పడుకునే ముందు గది ఉష్ణోగ్రతను 10–20 డిగ్రీలు ఉంచడం వల్ల నిద్ర బాగా పడుతుంది. అంతేకాకుండా దళసరి వస్త్రాలు ధరించడానికి బదులు కాటన్ దుస్తులు ధరించవచ్చు. అలాగే నిద్రపోయే ముందు యోగా చేస్తే.. ఒత్తిడిని తగ్గించి కమ్మని నిద్రవచ్చేలా ప్రేరేపిస్తుంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక


## దిల్ రాజు టార్గెట్‌గా ఐటీ దాడులు



తొలిఅడుగు, సినిమా టాలీవుడ్ బడా నిర్మాత దిల్ రాజు టార్గెట్ గా మంగళవారం తెల్లవారుజామున ఆదాయపన్ను శాఖ సోదాలు మొదలయ్యాయి. బడా నిర్మాతగానే కాకుండా తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న రాజుపై ఆదాయపన్ను శాఖ దాడులు చేస్తోందన్న వార్తలు అటు సినీ ఇండస్ట్రీతో పాటు ఇటు పొలిటికల్ సర్కిళ్లలోనూ హాట్ టాపిక్ గా మారింది. దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయనకు చెందిన కార్యాలయాలపైనా ఐటీ అధికారులు ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టారు. దిల్ రాజుతో పాటుగా శిరీష్, దిల్ రాజు కుమార్తె హన్షిత రెడ్డిల ఇళ్లు, కార్యాలయాలపైనా ఐటీ అధికారులు మూకుమ్మడిగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పలు బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులను చేపట్టారు. ఫలితంగా నగరంలోని బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో కలకలం రేగింది. మొత్తంగా నగరంలోని 8 ప్రాంతాల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఈ సంక్రాంతికి తెలుగులో ప్రధానంగా మూడు సినిమాలు రిలీజ్ కాగా.. వాటిలో రెండు దిల్ రాజు నిర్మించినవే ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రాంచరణ్ తేజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ వాటిలో భారీ బడ్జెట్ చిత్రం కాగా%%% విక్టరీ వెంకటేశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ రెండు సినిమాలను దిల్ రాజే నిర్మించారు. ఈ రెండు సినిమాలు హిట్ టాక్ తెచ్చుకోగా.. దిల్ రాజుకు భారీ ఎత్తున లాభాలు వచ్చినట్లుగా సమాచారం.


## కెరీర్లను డిసైడ్ చేయబోతున్న సినిమా

తొలిఅడుగు, సినిమా : మెగా ఫ్యామిలీ హీరో వరుణ్ తేజ్ కెరీర్ కొన్నేళ్ల నుంచి తిరోగమనంలో పయనిస్తోంది. అతడికి సోలో హీరోగా ఓ మోస్తరు విజయం దక్కి కూడా చాలా ఏళ్లయిపోయింది. గని, గాండీవధారి అర్జున్, ఆపరేషన్ వాలెంటైన్, మట్కా.. ఇలా సోలో హీరోగా తన చివరి సినిమాలు ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లవడంతో తన మార్కెట్ దారుణంగా దెబ్బతింది. ముఖ్యంగా 'మట్కా' కొట్టిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. ఈ చిత్రానికి మినిమం ఓపెనింగ్స్ లేవు. పెట్టుబడిలో ఐదో వంతు కూడా థియేటర్ల నుంచి వెనక్కి తేలేకపోయిందీ చిత్రం. దీంతో వరుణ్ కొత్త ప్రాజెక్టుల మీద ప్రభావం పడే పరిస్థితి వచ్చింది. అతను హీరోగా యువి క్రియేషన్స్ సంస్థలో మేర్లపాక గాంధీ తెరకెక్కించాల్సిన చిత్రం ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. కానీ యువి సంస్థ ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికే నిర్ణయించింది. తాజాగా ఈ చిత్రాన్ని అనౌన్స్ చేశారు కూడా. వరుసగా సీరియస్ సినిమాలు చేసి ఎదురు దెబ్బలు తిన్న వరుణ్ తేజ్.. ఈసారి కామెడీ ట్రై చేయబోతున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాల్లో చక్కటి వినోదం అందించిన మేర్లపాక గాంధీ.. అదే స్టయిల్లో వరుణ్ సినిమాను రూపొందించబోతున్నాడు. వీరి కలయికలో రానున్న సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగనుంది. దీనికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో క్రిష్ కుటుంబ సంస్థ అయిన 'ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్' కూడా భాగస్వామి కానుంది. తొలి రెండు చిత్రాలతో ప్రామిసింగ్‌గా కనిపించిన మేర్లపాక గాంధీ కూడా తర్వాత కృష్ణార్జున యుద్ధం, లైక్ సబ్‌స్క్రైబ్ షేర్ చిత్రాలతో తీవ్రంగా నిరాశపరిచాడు.




తొలిఅడుగు, సినిమాకొత్త ఏడాది మొదలయ్యాక సినీ ప్రియులందరి దృష్టి సంక్రాంతి చిత్రాల మీదే ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ సీజన్లో భారీ చిత్రాలు రిలీజవుతాయి. వారం పది రోజుల పాటు చర్చలన్నీ సంక్రాంతి చిత్రాల చుట్టూనే తిరుగుతాయి. ఈసారి గేమ్ చేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం లాంటి క్రేజీ చిత్రాలు సంక్రాంతి రేసులో నిలిచాయి. వీటిలో ముందుగా రిలీజైన భారీ చిత్రం 'గేమ్ చేంజర్' ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రెండో డాకు మహారాజ్ మంచి రిజల్ట్ సాధించింది. సంక్రాంతికి వస్తున్నాం ఎవ్వరూ ఊహించని స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. ఐతే సంక్రాంతి సినిమాల కథ ఈ వీకెండ్‌తో ఒక కొలిక్కి వచ్చేసింది. వాటి ఫైనల్ రిజల్ట్ మీద కూడా ఒక అంచనా వచ్చేసినట్లే. సోమవారం నుంచి 'గేమ్ చేంజర్' కథ ముగిసినట్లే భావిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం', 'డాకు మహారాజ్' సినిమాలు ఇంకో వారం పాటు ఓ మోస్తరు వసూళ్లతో సాగే అవకాశం ఉంది. మొత్తానికి సంక్రాంతి సినిమాల చర్చలకు త్వరలో ముగియబోతున్నాయి. ఆ తర్వాత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే సినిమా ఏది అంటే.. 'తండేల్' పేరే చెప్పాలి. వచ్చే రెండు వారాలు తెలుగులో చెప్పుకోదగ్గ రిలీజ్‌లు ఏమీ లేవు. ఈ శుక్రవారం సుకుమార్ తనయురాలు సుకృతి ప్రధాన పాత్ర పోషించిన 'గాంధీ తాత చెట్టు' సహా ఇంకొన్ని చిన్ని చిత్రాలేవో రిలీజవుతున్నాయి. ఆ తర్వాతి వారానికి చెప్పుకోదగ్గ సినిమాలేవీ షెడ్యూల్ కాలేదు. ఈ రెండు వారాల్లో వచ్చే చిత్రాలకు ప్రేక్షకులు థియేటర్లకు రావడం కష్టమే.సంక్రాంతికి బాగా ఖర్చు పెట్టేసిన ప్రేక్షకులు కొంచెం గ్యాప్ తీసుకుని ఫిబ్రవరి 7న రానున్న 'తండేల్' మీద ఫోకస్ చేయబోతున్నారు. ఆ సినిమా మీద భారీ అంచనాలే ఉన్నాయి. ముందు నుంచి ప్రామిసింగ్‌గా కనిపిస్తున్న చిత్రమిది. నాగచైతన్య-సాయిపల్లవి జోడీ మీద కూడా చాలా ఆశలతో ఉన్నారు.

## ఓవర్ టు నాగచైతన్య...



## 'బుల్లిరాజు' విమర్శలకు అనిల్ సమాధానం

తొలిఅడుగు, సినిమా సంక్రాంతి కానుకగా విడుదలై బ్లాక్ బస్టర్ సక్సెస్‌తో దూసుకుపోతున్న చిత్రం.. సంక్రాంతికి వస్తున్నాం. ఈ చిత్రంలో చాలా విశేషాలు ఉన్నాయి కానీ.. అన్నింట్లోకి హైలైట్ అయింది మాత్రం బుల్లిరాజు అనే చిన్న పిల్లాడి పాత్ర చేసిన కామెడీనే. ఓటీటీలు చూసి పాడైపోయి, కనిపించిన ప్రతి వాడి మీద బూతుల వర్షం కురిపించే పిల్లాడిగా రేవంత్ అనే అబ్బాయి అదరగొట్టేశాడు. గోదావరి స్లాంగ్‌లో అతను చెప్పిన డైలాగులకు థియేటర్లు హోరెత్తిపోతున్నాయి.ఐతే ఈ పాత్ర విషయంలో విమర్శలు కూడా తప్పట్లేదు. అంత చిన్న పిల్లాడితో అలాంటి బూతులు చెప్పించి సొసైటీకి ఏం సందేశం ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కామెడీ విషయంలో ఫిలిం మేకర్స్ మరీ ఇన్‌సెన్సిటివ్‌గా తయారవుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ పాత్రను చూసి పిల్లలు ఇన్‌స్పైర్ అయితే ప్రమాదం కదా అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు అనిల్ రావిపూడి స్పందించాడు. "బుల్లిరాజు పాత్రకు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆ కామెడీని అందరూ సరదాగా తీసుకుంటున్నారు. ఎంజాయ్ చేస్తున్నారు. కానీ ఈ పాత్ర విషయంలో విమర్శలు నా దృష్టికి వచ్చాయి. మా ఫ్రెండ్స్ కూడా కొందరు పిల్లాడితో అలా బూతులు చెప్పించడం ఏంటి అని అడిగారు. కానీ మేం ఆ పాత్రతో చిన్న సందేశం ఇచ్చాం. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు ఓటీటీలో కంటెంట్ చూస్తే.. వాటికి ఎక్కువ అలవాటు పడితే ఎంత ప్రమాదం అన్నది చూపించాం. ఇంగ్లిష్, హిందీ వెబ్ సిరీస్‌లకు తెలుగు అనువాదాలు చూశారంటే దారుణమైన బూతులు ఉంటాయి. వాటిని విని తట్టుకోలేం. అలాంటివి పిల్లలు చూడకూడదని చెప్పడమే మా ఉద్దేశం.



## అసలు రూపం మారిపోయిన 'భైరవం'



తొలిఅడుగు, సినిమా ఒక రీమేక్ ఎంచుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో దర్శకులకు పెద్ద సవాల్ గా మారిపోయింది. ఒరిజినల్ వెర్షన్ ని సబ్ టైటిల్స్ తోనో లేదా డబ్బింగ్ ఆడియోలోనో చూసి ముందే అవగాహనకు వస్తున్న ప్రేక్షకులు పెరిగిపోతున్నారు. అలాని ప్రతిదీ వర్కౌట్ అవ్వదని కాదు. సరైన మార్పులు చేర్పులు చేసుకుంటే ఖచ్చితంగా మెప్పించే అవకాశం ఉంటుంది.భైరవం వర్క్ చూస్తుంటే అదే అనిపిస్తోంది. బెల్లకొండ సాయిశ్రీనివాస్ మూడేళ్ళ గ్యాప్ తర్వాత తెలుగులో కనిపించబోతున్న సినిమా ఇదే. నారా రోహిత్, మంచు మనోజ్ లతో స్క్రీన్ పంచుకోవడంతో దీని మీద క్రమంగా అంచనాలు రేగడం మొదలయ్యింది.గత ఏడాది కోలీవుడ్ సూపర్ హిట్స్ లో ఒకటిగా నిలిచిన గరుడన్ రీమేక్ ఇది. అయితే తాజాగా వచ్చిన భైరవం టీజర్ చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. మూలకథను తీసుకుని తెలుగు మాస్ ఆడియన్స్ కి తగ్గట్టు చేసిన కీలక మార్పులు బాగానే కనిపిస్తున్నాయి. ముగ్గురు ప్రాణ స్నేహితులు, వాళ్ళ మధ్య బంధాన్ని రామలక్ష్మణులు, ఆంజనేయుడులతో పోలుస్తూ తీర్చిదిద్దిన క్యారెక్టరైజేషన్ విభిన్నంగా ఉంది.ఈ మధ్య బ్లాక్ బస్టర్స్ లో బాగా పండుతున్న జాతర ఎపిసోడ్ ఒకటి భైరవంలోనూ ఉంది. సాయిశ్రీనివాస్ నటనలోని కొత్త కోణంలో ఇందులోనే చూడొచ్చు. చిన్న శాంపిల్ ని టీజర్ లో చూపించారు. నాంది, ఉగ్రం ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన భైరవంని ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డేట్ ఇంకా నిర్ణయించలేదు. దర్శకుడు శంకర్ కూతురు అదితి శంకర్ టాలీవుడ్ కు ఈ సినిమాతోనే పరిచయమవుతోంది. సీనియర్ నటి జయసుధ చాలా కాలం తర్వాత నాయనమ్మగా ముఖ్యమైన పాత్ర పోషించారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



# క్వార్టర్ ఫైనల్లో ఇగా, సిన్నర్




తొలిఅడుగు : ప్రతిష్ఠాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ), 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్), 8వ సీడ్ ఎమ్మా నవ్వారో (అమెరికా) నాలుగో రౌండ్ జయకేతనం ఎగుర వేశారు. 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా), 28వ సీడ్ ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ పోరులో జయభేరి మోగించారు. ఇవా లీస్ (జర్మనీ)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో అగ్రశ్రేణి క్రీడాకారిణి స్వియాటెక్ అలవోక విజయం సాధించింది. ఆరంభం నుంచే ఇగా చెలరేగి ఆడింది. ఒక్క గేమ్ కూడా కోల్పోకుండానే తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. తర్వాతి సెట్‌లో కూడా దూకుడును ప్రదర్శించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ అలవోక విజయంతో ముందంజ వేసింది. మరో పోటీలో నవ్వారో 64, 57, 75తో రష్యాకు చెందిన కసట్కినాను ఓడించింది. ఆరంభం నుంచే పోరు ఆసక్తికరంగా సాగింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో నవ్వారో విజయం సాధించింది. రెండో సెట్‌లో కూడా హోరాహోరీ తప్పలేదు. టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్‌లో కసట్కినా జయభేరి మోగించింది. ఇక ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో కూడా ఉత్కంఠ తప్పలేదు. ఈ సెట్ కూడా టైబ్రేకర్‌కు వెళ్లింది. ఇందులో పైచేయి సాధించిన నవ్వారో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. కీస్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లో చెమటోడ్చక తప్పలేదు. మూడు సెట్ల పోరాటంలో 63, 16, 63తో రికబినా (కజకిస్థాన్)పై విజయం సాధించింది. మరో పోరులో స్విటోలినా 64, 61తో రష్యా క్రీడాకారిణి వెరోనికా కుదెర్‌మెటోవాను ఓడించింది. ఆరంభం నుంచే స్విటోలినా నిలకడగా ఆడింది. తొలి సెట్‌లో కాస్త ప్రతిఘటనను ఎదుర్కొన్న తర్వాతి సెట్‌లో అలవోక విజయంతో ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో జన్నిక్ 63, 36, 63, 62తో హోల్గర్ రూనే (డెన్మార్క్)ను ఓడించాడు. తొలి సెట్‌లో జన్నిక్ అలవోక విజయాన్ని అందుకున్నాడు. అయితే రెండో సెట్‌లో రూనే ఆధిపత్యం చెలాయించాడు. సిన్నర్‌ను కంగుతినిపిస్తూ సెట్‌ను దక్కించుకున్నాడు. కానీ తర్వాతి రెండు సెట్లలో సిన్నర్ దూకుడును ప్రదర్శించాడు. రూనేకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సునాయాస విజయంతో ముందంజ వేశాడు. మరో పోటీలో మినార్ 60, 76, 63తో అలెక్స్ మిఛెల్‌సన్ (అమెరికా)ను ఓడించాడు.

# ఆ ఎంపితో రింకు సింగ్ పెళ్లి

తొలిఅడుగు : టీమిండియా టి20 బ్యాట్స్‌మెన్ రింకు సింగ్ ఇంటి వాడు కాబోతున్నాడు. సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపి ప్రియ సరోజ్‌ను రింకు పెళ్లి చేసుకోబోతున్నారని ఆమె తండ్రి, ఎంఎల్ఎ తుఫాని సరోజ్ తెలిపారు. రింకు, ప్రియకు నిశ్చితార్థం జరిగినట్టు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను తొలుత ఖండించిన ఆయన చర్చలు జరుగుతున్నాయని వివరణ ఇచ్చారు. రెండు కుటుంబాలు పెళ్లికి అంగికరించాయని చెప్పారు. గత సంవత్సరం నుంచి ఇద్దరు మధ్య పరిచయం ఉండడంతో ప్రేమగా మారింది. పార్లమెంటు సమావేశాల తరువాత లక్నోలో నిశ్చితార్థం జరుపుతామని ప్రియ తండ్రి తెలిపారు. సమాజ్ వాదీ పార్టీ తరుపున మచిలీషహర్ నుంచి ఎంపిగా గెలిచారు. ఆమె గతంలో సుప్రీంకోర్టు న్యాయవాదిగా సేవలందించారు. ఆమె తండ్రి తుపానీ మూడు సార్లు ఎంపిగా పని చేశారు. రింకు సింగ్ ఇంగ్లాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు ఎంపికయ్యారు.




# టీ20 కొత్త వైస్ కెప్టెన్ హాట్ కామెంట్స్

తొలిఅడుగు : భారత క్రికెట్ జట్టు కీలకమైన పరివర్తన దశను ఎదుర్కొంటున్న సమయంలో టీ20 వైస్ కెప్టెన్ అక్సర్ పటేల్ తన పాత్రపై స్పష్టత వ్యక్తం చేశాడు. జట్టులో తన స్థానం గురించి ఆందోళన లేకుండా, అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడమే తన లక్ష్యమని అన్నాడు. సెలెక్షన్ పూర్తిగా కెప్టెన్లు మరియు సెలెక్టర్ల నిర్ణయమని అభిప్రాయపడ్డాడు. ప్రతీసారి అవకాశం వచ్చినప్పుడు, తన ప్రతిభను నిరూపించడంపైనే దృష్టి పెట్టుతానని తెలిపాడు. భారత క్రికెట్ ప్రస్తుతం ఒక పెద్ద పరివర్తన దశలో ఉంది, కానీ ఆ పరిస్థితుల్లో తన స్థానంపై ఎలాంటి ఆందోళన లేకుండా తన పాత్రకు న్యాయం చేయడంపైనే దృష్టి పెట్టాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు అక్షర్ పటేల్. 11 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మూడు ఫార్మాట్లలో 184 వికెట్లు తీసిన అక్షర్, జట్టులో తన స్థానం గురించి నిర్భయంగా మాట్లాడారు. అక్షర్ పటేల్ తన దృష్టిని ప్రతిసారి తన పాత్రకు సమర్థంగా న్యాయం చేయడంపైనే ఉంచుతానని స్పష్టం చేశారు. "ఎవరికీ ఏదైనా నిరూపించాల్సిన అవసరం నాకు లేదు. నాకు అప్పగించిన పనిని నైపుణ్యంతో చేయడమే నా ధ్యేయం. జట్టులో నా స్థానం ప్రదర్శనతోనే వస్తుంది, ఒత్తిడితో కాదు," అని ఆయన అన్నారు. భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా తరహా ఆటగాళ్ల స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉన్నా, అక్షర్ తన ప్రదర్శనపై మాత్రమే దృష్టి పెడతానని అన్నారు. "నేను టెస్టులు, వన్డేలు, టీ20లు అన్ని ఫార్మాట్లలో ఆడగలనన్న నమ్మకంతో ఉన్నాను. ప్రదర్శన ద్వారా న్యాయం చేయడమే నా పద్ధతి," అని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ముందు జరిపిన చర్చల్లో, "సెలక్షన్ సంబంధిత అంశాలు సెలెక్టర్ల నిర్ణయం. నేను ఎప్పుడూ జట్టులో భాగమయ్యేందుకు తగిన ప్రయత్నం చేస్తాను. కానీ ఆందోళన చెందే స్థానం లేదు," అని ఆయన అన్నారు. టీ20 ఫార్మాట్‌లో పాత్రలు చాలా స్పష్టంగా ఉంటాయని అక్షర్ అభిప్రాయపడ్డారు. "ఇది ఒక వేగవంతమైన ఫార్మాట్, సరైన వ్యూహాలు, నిర్ణయాలే విజయం నిర్ధారిస్తాయి. నన్ను నేను ఏ పాత్రలో చూపించాలో సహాయక సిబ్బంది ద్వారా స్పష్టత ఉంటుంది," అని ఆయన తెలిపారు. భారత జట్టు బలమైన పరివర్తన దశలో ఉండగా, అక్షర్ తన పాత్రకు న్యాయం చేస్తూ, అవకాశాల కోసం నిరీక్షిస్తున్నాడు. ఈ ప్రస్తుత దశలో తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సరైన రీతిలో ఉపయోగించుకోవడమే తన లక్ష్యమని అక్షర్ పటేల్ స్పష్టం చేశారు. భారత జట్టు మూడు ఫార్మాట్లలో సమర్థంగా ఉండే యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్ టీ20 ఫార్మాట్‌లో వేగవంతమైన, ఆవిష్కరణాత్మకమైన ఆటగాళ్లకు వేదికగా నిలుస్తుంది. భారత క్రికెట్‌లో స్పిన్ ఆల్‌రౌండర్లకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, అక్షర్ తన ప్రదర్శనతో జట్టులో స్థానం కల్పించుకోవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.




# నైజీరియా సంచలనం

తొలిఅడుగు : ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో పసికూన నైజీరియా జట్టు సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన గ్రూప్-సి లీగ్ మ్యాచ్‌లో నైజీరియా జట్టు రెండు పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై అద్భుత విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా జట్టు 13ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 65పరుగులే చేసింది. అనంతరం న్యూజిలాండ్‌ను నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 63పరుగులకే పరిమితం చేసింది. 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్ల నష్టానికి 57పరుగులు చేసి గెలుపుకు చేరువైన కివీస్‌ను నైజీరియా బౌలర్ చివరి ఓవర్లో కట్టడి చేసింది. నైజీరియా బ్యాటర్లలో ఉదేహ్(19), కెప్టెన్ లక్కీ(18) రెండంక్కెల స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ జట్టులో అనికా టోడ్(19) బ్యాటింగ్‌లో రాణించింది. గ్రూప్-డిలో ఆస్ట్రేలియా మహిళల జట్టు 2వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై, గ్రూప్-బిలో ఇంగ్లండ్ జట్టు 6వికెట్ల తేడాతో పాకిస్తాన్ మహిళలపై విజయం సాధించాయి. ఇక దక్షిణాఫ్రికా మహిళలజట్టు ఏకంగా 10వికెట్ల తేడాతో సమోవా మహిళలపై విజయం సాధించాయి. సమోవా జట్టు 9.1ఓవర్లలో 16పరుగులకే ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా జట్టు 1.4ఓవర్లలోనే లక్ష్యాన్ని చేదించింది.

